@netifocusnews @focustv
www.netifocusnews.com
TS-18-0006625
నేటి ఫోకస్ న్యూస్
అను నిత్యం...ప్రజా పక్షం...
తెలుగు డిజిటల్ దినపత్రిక
ఎడిటర్: యం.తరుణ్ || తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రజల కోసం మా ఈ నేటి ఫోకస్ న్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రిక || మంగళవారం 02, ఏప్రిల్ 2024 || పేజీలు: 04

# నన్ను దెబ్బతీసే కుట్ర జరుగుతోంది

## కాంగ్రెస్‌ను ఓడించేందుకు బీఆర్ఎస్-బీజేపీ పన్నాగం..



- ఓట్ల కోసం మతాల మధ్య గొడవలు పెట్టే ప్రయత్నం
- కొడంగల్ నా గుండెచప్పుడు.. ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా
- కొడంగల్ కాంగ్రెస్ నాయకులతో సీఎం రేవంత్ సమీక్ష
- కాన్వాయ్‌లో పేలిన ఓ వాహనం టైర్.. తప్పిన ప్రమాదం..

నేటి ఫోకస్ న్యూస్, కొడంగల్, ఏప్రిల్ 8:

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. తనను పడదోసేందుకు కొందరు కుట్రలు చేస్తున్నారని, వెనక నుంచి గూడుపుఠానీ జరుగుతోందని ఆరోపించారు. ఓట్ల కోసం మతాల మధ్య గొడవలు పెట్టాలని కొందరు ప్రయత్నిస్తున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బీఆర్ఎస్, బీజేపీ కలిసి కాంగ్రెసను ఓడించేందుకు పన్నాగాలు పన్నుతున్నాయని, వాటిని తిప్పికొట్టేందుకు పార్టీ కార్యకర్తలు, నాయకులు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. మిగతా 2లో..

# ఎమ్మెల్సీ బెయిల్ పిటిషన్ కొట్టివేత



- బెయిలిస్తే సాక్ష్యాలు తారుమారు చేసి, సాక్ష్యులపై ఒత్తిడి తెచ్చే ముప్పు
- కుమారుడి పరీక్షలనేది బెయిల్‌కి పెద్ద కారణం కానే కాదు
- బెయిల్ నిరాకరిస్తూ ఈడీ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి వ్యాఖ్యలు

నేటి ఫోకస్ న్యూస్, న్యూఢిల్లీ, ఏప్రిల్ 8:

ఢిల్లీ మద్యం కేసులో ఈడీ ప్రత్యేక కోర్టు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు బెయిల్ నిరాకరించింది. కవితకు బెయిల్ ఇస్తే సాక్ష్యులను ప్రభావితం చేసే అవకాశం ఉందని, సాక్ష్యాధారాలను తారుమారు చేసి తప్పించుకునే ముప్పు ఉందని మిగతా 2లో..




ఉమ్మడి రాష్ట్ర ప్రజలకు, నేటి ఫోకస్ న్యూస్ పాఠకులకు, విలేకరులకు, సిబ్బందికి ఉగాది పర్వదిన శుభాకాంక్షలు..



2

## మెట్రో ప్రయాణికులకు గుడ్‌న్యూస్




# తెలంగాణ నిప్పుల కొలిమి

- నిడమనూరులో 44.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు
- మరో 16 ప్రాంతాల్లో సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు..
- నేడు, రేపు పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్
- పలు ప్రాంతాలకు వర్ష సూచన

నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-ఏప్రిల్ 8:

రాష్ట్రంలో భానుడి భగభగలు ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. వేగంగా వీస్తున్న వడగాడ్పులు జన జీవనాన్ని స్తంభింపజేస్తున్నాయి. ఏప్రిల్ మొదటి వారంలో ఈ స్థాయిలో వరుసగా అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు కావడం గత ఐదేళ్లలో ఇదే తొలిసారి అని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. సాధారణంగా ఏప్రిల్ మూడో వారం మిగతా 2లో..

## తాగునీటికి కటకటే! 2



# 13నుంచి జిల్లాల్లో కేసీఆర్ బస్సుయాత్ర

## చేవెళ్ల నుంచి లోక్‌సభ ఎన్నికల ప్రచారం ప్రారంభం..

నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-ఏప్రిల్9:

పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో పాల్గొనేందుకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బస్సు యాత్రకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఈ నెల 13నుంచి ఆయన ప్రజల్లోకి రానున్నారు. ఆ రోజు చేవెళ్ల బహిరంగ సభలో ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టనున్నారు. బహిరంగ సభల కంటే బస్సు యాత్రల వైపే గులాబీ బాస్ మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. ప్రతి పార్లమెంట్ పరిధిలోని ప్రతి నియోజకవర్గానికి బస్సు యాత్ర చేస్తూ ఎన్నికల ప్రచారంలో కేసీఆర్ పాల్గొననున్నట్లు సమాచారం. చేవెళ్ల పార్లమెంట్ స్థానం నుంచే బస్సు యాత్ర ప్రారంభించనున్నట్లు పార్టీ వర్గాల ద్వారా తెలుస్తోంది. ఈ నెల 13న కేసీఆర్ చేవెళ్ల లో నిర్వహించే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ శ్రేణులకు ఆ పార్టీ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ పిలుపునిచ్చారు. మిగతా 2లో..





# హత్య చేసి..

- ఆపై ఇన్‌స్టాలో రీల్ పోస్ట్ చేసి
- పాత కక్షలతోనే తేజస్ హతం

నేటి ఫోకస్ న్యూస్, నిజాంపేట్-ఏప్రిల్ 8:

ప్రతీకారంతో రగిలిపోతున్న ఓ గ్యాంగ్ ప్రత్యర్థి కోసం కాపు కాసి పక్కా స్కెచ్‌తో అదును చూసి అంతమొందించింది. ఆపై హత్యకు ఉపయోగించిన కత్తులు పట్టుకొని నృత్యాలు చేస్తూ రక్తంతో తడిసిన చేతులతో రీల్స్ చేసి లెక్క సరిపోయింది.. పగ మిగతా 2లో..

# ఆన్‌లైన్ బెట్టింగ్‌కు కుటుంబ బలి

నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-ఏప్రిల్ 8:

ఆన్‌లైన్ బెట్టింగ్ ఓ కుటుంబాన్ని బలి తీసుకుంది. ఆన్‌లైన్ బెట్టింగ్ విషయంలో దంపతుల మధ్య జరిగిన గొడవలే ఈ మరణాలకు కారణమని పోలీసులు అనుమానిస్తున్నారు. రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం రాత్రి ఈ ఘటన వెలుగులోకి మిగతా 2లో..



# పేదల హక్కులను కాంగ్రెస్ హరించింది

- గత పదేళ్లలో దేశం దూసుకుపోతుంది
- చత్తీస్‌గడ్ పర్యటనలో ప్రధాని నరేంద్ర మోదీ



నేటి ఫోకస్ న్యూస్, చత్తీస్‌గడ్-ఏప్రిల్8:

మావోయిస్టుల కంచుకోట బస్తరలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు ప్రధాని నరేంద్ర మోదీ. చత్తీస్‌గడ్‌లో గతంలో అధికారంలో మిగతా 2లో..

నిత్య నూతనంగా వెలువడుతూ..
నేటి ఫోకస్ న్యూస్
అను నిత్యం...ప్రజా పక్షం...
తెలుగు డిజిటల్ దినపత్రిక
సంచలన వార్తా కథనాలతో నిత్యం విశేష పాఠకాధరణ పొందుతున్న, నేటి ఫోకస్ న్యూస్ డిజిటల్ తెలుగు దిన పత్రికకు తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల వారిగా, నియోజకవర్గాల వారిగా, మండలాల వారిగా, మండలాల వారిగా బ్యూరోలు, స్టాఫ్ రిపోర్టర్లు, విలేకరులు కావలెలను.
ఆసక్తి ఉన్నవారు ఈ క్రింది నెంబర్‌కు సంప్రదించగలరు.
9848488596

# నన్ను దెబ్బతీసే కుట్ర జరుగుతోంది

(మొదటి పేజీ తరువాయి..)

సోమవారం వికారాబాద్ జిల్లా కొడంగల్‌లోని తన నివాసంలో నియోజకవర్గ స్థాయి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో మండలాల వారీగా లోక్‌సభ ఎన్నికలపై సీఎం రేవంత్ సమీక్ష నిర్వహించారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి, పార్టీ పరిశీలకుడు సంపత్‌కుమార్, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డితో కలిసి మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు ఈ సమీక్ష నిర్వహించారు. అనంతరం కార్యకర్తలనుద్దేశించి సీఎం మాట్లాడుతూ.. కొడంగల్‌లో కాంగ్రెసకు మెజారిటీ రాకుండా చేసి తనను దెబ్బకొట్టాలనే కుట్ర జరుగుతోందన్నారు. వంద రోజుల్లోనే నియోజకవర్గానికి మెడికల్, ఇంజనీరింగ్, వెటర్నరీ, నర్సింగ్, జూనియర్, డిగ్రీ కాలేజీలు తెచ్చుకున్నామని, వందల కోట్లతో తండాలకు రోడ్లు మంజూరు చేసుకున్నామని, రూ.4 వేల కోట్లతో నారాయణపేట - కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని తెచ్చుకున్నామని, గత ప్రభుత్వం విద్య, ఉద్యోగాలను విస్మరిస్తే.. తాము మూడు నెలల్లోనే 30 వేల ఉద్యోగాలను భర్తీ చేశామని అన్నారు. ఇంత చేస్తున్న తనను ఎందుకు పడదోయాలని చూస్తున్నారని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. తెరచాటు కుట్రలను కాంగ్రెస్ కార్యకర్తలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.

“నేను ఎక్కడున్నా నా గుండెచప్పుడు కొడంగల్ మాత్రమే. నాతో కొట్లాడే హక్కు మీకుంది. రాష్ట్రానికే నాయకత్వం వహించే అవకాశం మనకు సోనియమ్మ ఇచ్చారు. కొడంగల్‌ను దేశంలోనే ఆదర్శవంతంగా తీర్చిదిద్దుదాం” అని కాంగ్రెస్ కార్యకర్తలతో సీఎం రేవంత్ అన్నారు. కొడంగల్‌ను అభివృద్ధి చేయనీయకుండా బీజేపీ నాయకురాలు అరుణమ్మ కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. బీజేపీలో జాతీయ ఉపాధ్యక్ష పదవి తెచ్చుకున్న అరుణమ్మ.. పాలమూరు ఎత్తిపోతలకు జాతీయ హెూదా ఎందుకు తేలేకపోయారని ప్రశ్నించారు. కాంగ్రెసను ఓడించాలని బీజేపీ, బీఆరెస్ అంటున్నాయని, ఎందుకు ఓడించాలో చెప్పాలని అన్నారు. ఆడబిడ్డలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించినందుకా? రూ.500కే గ్యాస్ సిలిండర్ ఇచ్చినందుకా? 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు అందిస్తున్నందుకా? ఇందిరమ్మ ఇండ్లు ఇస్తున్నందుకా? అని నిలదీశారు. పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం కొడంగల్‌లో ఏ ఒక్కరికైనా డబుల్ బెడ్రూం ఇల్లు ఇచ్చిందా ? అని సీఎం ప్రశ్నించారు. పదేళ్లుగా ప్రధానిగా ఉన్న మోదీకి మళ్లీ ఓటేసి గెలిపిస్తే ఆయనేమైనా ఇప్పుడు చంద్రమండలానికి రాజు అవుతారా? అని ఎద్దేవా చేశారు. పదేళ్లుగా ప్రధానిగా మోదీ ఈ ప్రాంతానికి ఏం చేశారని ప్రశ్నించారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం తాను అత్యధిక నిధులు తీసుకువచ్చానని, ఎన్నికల తర్వాత మరిన్ని నిధులతో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని చెప్పారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డికి కొడంగల్ నియోజకవర్గంలో 50 వేల ఓట్ల మెజారిటీ ఇవ్వాలని, తన గౌరవం తగ్గకుండా చూడాలని కార్యకర్తలను కోరారు. రాష్ట్రంలోని అన్ని ఎంపీ స్థానాలనూ గెలిపిస్తే రాహుల్‌గాంధీ ప్రధాని అవుతారని అన్నారు. కాంగ్రెస్ లోక్‌సభ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి మాట్లాడుతూ.. సీఎం హెూదాలో రేవంత్‌రెడ్డి, ఆయన సోదరుడు తిరుపతిరెడ్డి ఆరోగ్యం బాగాలేకపోయినా రాత్రి వరకు సమీక్షలు నిర్వహించడం అభినందనీయమన్నారు. రేవంత్‌రెడ్డి శ్రమను చూసి తాను ముగ్ధుడినయ్యానని అన్నారు.

**సీఎం రేవంత్‌కు తప్పిన ప్రమాదం..**

సీఎ రేవంత్‌కు ప్రమాదం తప్పింది. కాన్వాయ్‌లోని ఓ వాహనం టైర్ ఒక్కసారిగా పేలిపోయింది. డ్రైవర్ అప్రమత్తతతో ప్రమాదం తప్పింది. సోమవారం మధ్యాహ్నం సీఎం కొడంగల్ వెళ్తుండగా వికారాబాద్ జిల్లా మన్నెగూడ సమీపంలో ఒక్కసారిగా కాన్వాయ్‌లో ఉన్న ఓ ల్యాండ్ క్రూజర్ వాహనం టైర్ పేలిపోయింది. డ్రైవర్ కారును పక్కకు మళ్లించి నిలిపివేశాడు. మెకానిక్‌ను పిలిపించి పేలిన టైరును మార్పించారు.

# 13నుంచి జిల్లాల్లో కేసీఆర్ బస్సుయాత్ర

(మొదటి పేజీ తరువాయి..)

రాష్ట్రంలో ఎండిన పంటలను పరిశీలించాలని కేసీఆర్ ఇటీవల పొలంబాట పట్టారు. అందులో భాగంగా ఈ నెల 5న కరీంనగర్ జిల్లాలో పర్యటించారు. పలు నియోజకవర్గాల్లో ఎండిన పంటలు పరిశీలించి రైతులతో నేరుగా మాట్లాడారు. రైతులు ధైర్యంగా ఉండాలని.. బీఆర్ఎస్ పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పలువురు రైతులు ఆయనకు సమస్యలు ఏకరువు పెట్టారు. సాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని గులాబీ బాస్ దృష్టికి తెచ్చారు. మంచినీళ్లకు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు కొందరు చెప్పారు. దీనిపై స్పందించిన కేసీఆర్.. ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. అంతకు ముందు జనగామసూర్యాపేట, నల్గొండ జిల్లాల్లో కేసీఆర్ పర్యటించారు. తెలంగాణలో అన్నదాతలు మళ్లీ ఆత్మహత్యలు చేసుకునే దుస్థితి వస్తుందని అనుకోలేదని.. ఈ పరిస్థితి ఎందుకు వచ్చిందో అంతా ఆలోచించాలని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అన్నారు. పంటలు పరిశీలించిన అనంతరం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. 'కాంగ్రెస్ 100 రోజుల పాలనలో 200 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. దేశంలోనే నెంబర్ వన్ స్థానంలో ఉన్న తెలంగాణకు స్వల్ప కాలంలోనే ఈ దుస్థితి ఎందుకు రావాలి.?. సాగునీళ్లు ఇస్తారని నమ్మి రైతులు పంటలు వేసుకున్నారని.. ముందే చెబితే వేసుకునే వాళ్లం కాదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నాయి. ఇంత కష్టకాలం వస్తుందని నేను ఎప్పుడూ అనుకోలేదు.' అని కేసీఆర్ అసంతృప్తి వ్యక్తం చేశారు.

# పేదల హక్కులను కాంగ్రెస్ హరించింది

(మొదటి పేజీ తరువాయి..)

ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సొమ్మును లూటీ చేసిందని ఆరోపించారు మోదీ. తాను అవినీతిపై యుద్ధం ప్రకటిస్తే విపక్షాలు మోదీ గ్యారంటీలపై విషం చిమ్ముతున్నాయని మండిపడ్డారు. ఎన్ని అవాంతరాలు ఎదురైనా అవినీతిని అంతం చేస్తానని అన్నారు. ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్‌లో జరిగిన విజయ్ సంకల్ప్ శంఖనాద్ మహారాలీలో ప్రసంగించిన ప్రధాని మోదీ కాంగ్రెస్‌పై విరుచుకుపడ్డారు. పేదల గురించి కాంగ్రెస్ ఏనాడూ పట్టించుకోలేదన్నారు. కాంగ్రెస్ నేతలు పేదల హక్కులను లాక్కున్నారని ఆరోపించారు. పేదలకు హక్కులు కల్పించి సగౌర్వంగా జీవించేలా చేశామన్నారు. ప్రస్తుతం దేశం మొత్తం మరోసారి మోదీ సర్కార్ అంటున్నారు. దేశంలోని ప్రతి పేదవాడికి నేను అండగా ఉంటానని ప్రధాని మోదీ భరోసా ఇచ్చారు.. బీజేపీ ప్రభుత్వం పేదల కోసం ఒక్కొక్కటిగా పథకాలు తీసుకువచ్చి వారి హక్కులను కల్పించిందని ప్రధాని మోదీ గుర్తు చేశారు. ప్రభుత్వం చేస్తున్న ఈ కృషి ఫలితంగానే దేశంలో 25 కోట్ల మందికి పైగా ప్రజలు పేదరికం నుంచి బయటపడ్డారన్నారు. పేదవారి ప్రతి ఆందోళనను తొలగించే వరకు విశ్రమించనని నిర్ణయించుకున్నానని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. పేదల సంక్షేమం కోసం అనేక పథకాలు ప్రారంభించామన్నారు. ఆయుష్మాన్ పథకం పేదలకు ఎంతగానో ఉపయోగపడుతుందని గుర్తు చేశారు. దశాబ్దాల తర్వాత దేశం సుస్థిరమైన, బలమైన బీజేపీ ప్రభుత్వాన్ని చూసిందని ప్రధాని మోదీ అన్నారు. పేదల సంక్షేమమే మా ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిస్తోంది. స్వాతంత్ర్యానంతరం పేదల అవసరాలను కాంగ్రెస్ ప్రభుత్వాలు దశాబ్దాలుగా పట్టించుకోలేదు. కాంగ్రెస్ ఎప్పుడూ పేదల గురించి పట్టించుకోలేదు, వారి సమస్యలను అర్థం చేసుకోలేదు. కాంగ్రెస్ కుటుంబంలోని ధనవంతులకు ద్రవ్యోల్బణం అంటే అర్థం కాలేదన్నార ప్రధాని మోదీ. పేదలకు ఉచితంగా రేషన్, వ్యాక్సిన్ ఇచ్చామని ప్రధాని మోదీ అన్నారు. కరోనా కాలాన్ని ప్రస్తావిస్తూ, ప్రధాని మాట్లాడుతూ, కరోనా సమయంలో ప్రజలు భారతదేశం ఎలా మనుగడ సాగిస్తుందని చెప్పేవారు? కాంగ్రెస్ హయాంలో దేశంలో వ్యాక్సిన్ రావడానికి దశాబ్దాలు పట్టేది. భారత దేశంలోని ప్రతి పేదవాడికి అండగా ఉంటానని ప్రధాని మోదీ హామీ ఇచ్చారు. పేదలకు ఉచితంగా వ్యాక్సిన్, ఉచితంగా రేషన్ ఇచ్చామని గుర్తు చేశారు. 2014కి ముందు లక్షల కోట్ల రూపాయల కుంభకోణాలు జరిగాయని ప్రధాని మోదీ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఢిల్లీ నుంచి ఒక్క రూపాయి వస్తే, అదీ గ్రామాలకు 15 పైసలు మాత్రమే వచ్చేవి. మిగిలిన 85 పైసలను కాంగ్రెస్ వారే కొల్లగొట్టారని ఆరోపించారు. కాంగ్రెస్ దోచుకునే ఈ వ్యవస్థను ఆపానని స్పష్టం చేశారు మోదీ. అవినీతిపరుల నల్లధనాన్ని అడ్డుకున్నానని, . బీజేపీ ప్రభుత్వం తన పదేళ్లలో రూ.34 లక్షల కోట్లను నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు పంపించినట్లు ప్రధాని మోదీ తెలిపారు.

# ఎమ్మెల్సీ కవిత బెయిల్ పిటిషన్ కొట్టివేత

(మొదటి పేజీ తరువాయి..)

కోర్టు అభిప్రాయపడింది. కుమారుడి పరీక్షల కోసం కవితకు బెయిల్ ఇవ్వడం తప్పనిసరి కానేకాదని న్యాయమూర్తి కావేరి భవేజా వ్యాఖ్యానించారు. దర్యాప్తులో పాల్గొనకముందు, నోటీసులు అందుకున్న తర్వాత.. కవిత తన ఫోన్లలోని సమాచారాన్ని విధ్వంసం చేసినట్టు ఫోరెన్సిక్ నివేదికలో తేలిందని, ఆమె సాక్ష్యులను ప్రభావితం చేశారన్న విషయం కూడా స్పష్టమైందని న్యాయమూర్తి పేర్కొన్నారు. ఈ సమయంలో కవితకు బెయిల్ ఇస్తే ఆమె సాక్ష్యాలను తారుమారు చేసే ప్రమాదం ఉందని అభిప్రాయపడ్డారు. కవిత మహిళ అయినప్పటికీ ఆమెకు బెయిల్ ఇవ్వకపోవడానికి ఇవే ప్రధాన కారణాలని న్యాయమూర్తి కావేరి భవేజా వివరించారు. కవిత కుమారుడికి సగం పరీక్షలు ఇప్పటికే ముగిశాయని.. అతని వద్ద సోదరుడు, తండ్రి, పిన్ని తదితరులు ఉన్నారని న్యాయమూర్తి గుర్తుచేశారు. అసలు కవిత కుమారుడు ఏం చదువుతున్నాడు? ఎన్నిరోజులు బెయిల్ కావాలి? అనే అంశాలపై స్పష్టత ఇవ్వలేదని.. అతడి వద్ద ఉన్న సన్నిహిత బంధువులు అతనికి ఎందుకు మానసిక మద్దతు అందించలేరో వివరించలేదని పేర్కొన్నారు. కవిత 19 ఏళ్ల పెద్ద కుమారుడు స్పెయిన్‌లో తల్లిదండ్రులు తన పక్కన లేకుండానే చదువుకో గలుగుతున్నప్పుడు.. బంధువులు పక్కన ఉండగా చిన్న కుమారుడు పరీక్షలు ఎందుకు రాయలేడని ప్రశ్నించారు. టెక్నాలజీ యుగంలో తండ్రి ఇతర బంధువులు, సోదరుడు డిజిటల్ ఉపకరణాల ద్వారా కూడా కవిత కుమారుడితో సంబంధాలు ఏర్పరుచుకోవచ్చని కోర్టు అభిప్రాయపడింది. చదువుకున్న, సంపన్నులైన మహిళలు ఈరోజుల్లో వ్యాపారాలు నిర్వహిస్తున్నారని, అక్రమ కార్యకలాపాలకు కూడా పాల్పడుతున్నారని, అందువల్ల కోర్టు అలాంటి వారికి బెయిల్ ఇచ్చేముందు న్యాయ సమ్మతంగా వ్యవహరించాల్సి ఉంటుందని న్యాయమూర్తి పేర్కొన్నారు.

# తాగునీటికి కటకటే!

నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-ఏప్రిల్8:

తెలుగు రాష్ట్రాల్లోని వేలాది గ్రామాలకు తాగునీటిని అందించిన నాగార్జున సాగర్ అడుగంటుతోంది. దీంతో నాగార్జునసాగర్ లో ప్రమాదకర స్థాయి డెడ్ స్టోరేజీకి నీటి నిల్వలు పడిపోతుండడంతో డేంజర్ బెల్స్ ను మోగిస్తోంది. సాగర్ కృష్ణా జలాలపై ఆధారపడిన హైదరాబాద్ జంట నగరాలు, ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం జిల్లాలకు తాగునీటి గండం పొంచి ఉంది. తెలుగు రాష్ట్రాల వరప్రదాయినిగా ఉన్న నాగార్జున సాగర్ తీవ్ర వర్షాభావంతో వట్టి పోయింది. ఆశించిన స్థాయిలో వర్షాలు లేక సాగర్ నిండుకుంటోంది. దీంతో నాగార్జునసాగర్ ఆయకట్టు కింద ఖరీఫ్, రబీ సీజన్ లో ప్రభుత్వం క్రాప్ హాలిడే ప్రకటించింది. మరోవైపు వేసవి కాలం ప్రారంభం కావడం తో సాగర్ కృష్ణా జలాలపై ఆధారపడిన హైదరాబాద్ జంట నగరాలు, ఖమ్మం, ఉమ్మడి నల్లగొండ జిల్లాల్లో నీటి మంచినీటి ఎద్దడి తీవ్రమవుతోంది.590 అడుగుల గరిష్ట నీటి స్థాయి మట్టం కలిగిన నాగార్జునసాగర్ రిజర్వాయర్ లో ప్రస్తుతం 511 అడుగుల నీటిమట్టంతో 133.7 టీఎంసీల నీరు ఉంది. సాగర్ డెడ్ స్టోరేజ్ 510 అడుగులు 131 టీఎంసిలుగా నిర్ణయించడం జరిగింది. అయితే డెడ్ స్టోరేజ్ కి కేవలం మూడు అడుగుల దూరంలోనే ఉంది సాగర్ డ్యామ్. దీంతో నాగార్జున సాగర్‌లో ప్రమాద ఘంటికలు మోగుతున్నా యి. గత ఏడాది ఇదే సమయంలో 528.30 అడుగులతో 164 టీఎంసీల నీరు ఉంది. గత ఏడాదితో పోల్చితే నాగార్జునసాగర్ రిజర్వాయర్ లో 31 టీఎంసీల నీటి లభ్యత తక్కువగా ఉంది. గతంలో ఎన్నడూ లేని విధంగా నాగార్జునసాగర్ రిజర్వాయర్ లో నీటిమట్టం డెడ్ స్టోరేజ్ కి చేరుకుంటోంది. నాగార్జునసాగర్ రిజర్వాయర్ నుండి హైదరాబాద్ జంట నగరాలు ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం జిల్లాలకు తాగునీటి సరఫరా జరుగు తోంది. నాగార్జున సాగర్ ఎడమ కాలువ ద్వారా ఖమ్మం జిల్లా పాలేరు రిజర్వాయర్ ద్వారా తాగునీటిని అందిస్తున్నారు. సాగర్ రిజర్వాయర్ బ్యాక్ వాటర్ నుంచి పుట్టంగండి వద్ద ఎలిమినేటి మాధవరెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా రెండు మోటార్లతో 900 క్యూసెక్కుల నీటిని అక్కంపల్లి రిజర్వాయర్ కు పంపింగ్ చేస్తున్నారు. ఇక్కడి నుంచి జంట నగరాలకు 550 క్యూసెక్కులు, ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 597 గ్రామాలకు రోజుకు 25 క్యూసెక్కుల తాగునీటిని సరఫరా చేయాల్సి వస్తోంది. ప్రస్తుతం నాగార్జునసాగర్ రిజర్వాయర్ లో నీటి లభ్యత తక్కువగా ఉండడంతో తాగునీటికి ప్రమాదం పొంచి ఉంది. సాగర్ నీటిమట్టం డెడ్ స్టోరేజ్ కి చేరువలో ఉంది. డెడ్ స్టోరేజీకి ఎగువన ఉన్న కేవలం రెండు టీఎంసీల నీరు మాత్రమే ఉంది. ప్రస్తుతం అయితే ఏప్రిల్ నెల వరకు ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని రిజర్వాయర్లలో తాగునీటికి సరిపడా నీరు ఉంది. మే, జూన్, జూలై మూడు నెలలకు తాగునీటికి కటకట ఏర్పడే పరిస్థితి ఉంది.ఇక హైదరాబాద్ జంట నగరాలకు మంచినీటి సరఫరాను ప్రస్తుతం పుట్టంగండి ఎత్తిపోతల పథకం ద్వారా జరుగుతోంది. 510 అడుగుల డెడ్ స్టోరీకి దిగవకు నీటిమట్టం పడిపోతే పంపింగ్ కష్టమే అవుతుంది. నీటి మట్టాలు 510 అడుగుల దిగువనకు చేరినప్పుడు బ్యాక్ వాటర్ వద్ద జీరో పాయింట్ నుంచి డ్రెడ్జింగ్ ప్రక్రియతో భారీ మోటార్లతో పంపింగ్ చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. మరో వైపు 1450 కోట్ల రూపాయలతో సుంకిశాల వద్ద మూడోదశ పైపు పనులు కూడా కొనసాగుతున్నాయి. మంచినీటి ఎద్దడిని నివారించేందుకు అత్యవసర పనులను చేపడుతున్నారు. మరోవైపు ఏపీ తాగునీటి అవసరాలకు ఐదు టీఎంసీల నీటిని కుడి కాలువ ద్వారా విడుదల చేస్తున్నారు. దీంతో రెండు రోజుల్లో డెడ్ స్టోరేజ్ కి చేరుకునే ప్రమాదం ఉంది. భవిష్యత్ అవసరాలకు శ్రీశైలం, జూరాల ప్రాజెక్టు నుంచి నీటిని తీసుకునే అవకాశం కూడా లేదు. ఇప్పటికే ఆ రెండు ప్రాజెక్టులు వట్టిపోయి ఉన్నాయి. మరో మూడు నెలల పాటు తాగునీటి అవసరాలు ఎలా తీర్చుకోవాలని దానిపై అధికారులు తలలు పట్టుకుంటున్నారు. అటు నంద్యాల జిల్లా రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలకు సాగు త్రాగునీరందించే శ్రీశైలం జలాశయం ఇప్పుడు నీటి నిల్వలు తగ్గిపోయి వెలవెలబోతుంది.

# తెలంగాణ నిప్పుల కొలిమి

(మొదటి పేజీ తరువాయి..)

లేదా చివరి వారంలో వడగాడ్పుల ప్రభావం ఎక్కువగా ఉంటుంది. కానీ ఈసారి మొదటి వారం నుంచే వేడి గాలులు వీయడం ప్రారంభమైంది. వాతావరణంలో మార్పులే ఉష్ణోగ్రతల పెరుగుదలకు కారణమని అధికారులు వివరిస్తున్నారు. సోమవారం సాధారణం కంటే 1.6 డిగ్రీల సెల్సియస్ అధిక ఉష్ణోగ్రత నమోదైంది.

14 జిల్లాల్లో అత్యధిక ఉష్ణోగ్రతలు..

ఏప్రిల్ 8న రాష్ట్రంలో నమోదు కావాల్సిన సగటు ఉష్ణోగ్రత 39.2 డిగ్రీల సెల్సియస్ కాగా 40.9 డిగ్రీల సెల్సియస్ నమోదైంది. సాధారణ సగటు కంటే 32 జిల్లాల్లో అధిక ఉష్ణోగ్రత నమోదు కాగా... 14 జిల్లాల్లో అత్యధిక ఉష్ణోగ్రత నమోదైంది. నల్లగొండ, సూర్యాపేట, ఖమ్మం జిల్లాల్లో 42 డిగ్రీ సెల్సీయస్ కంటే అధికంగా నమోదు కావడం గమనార్హం. ఖమ్మం, మహబూబ్‌నగర్, మెదక్ జిల్లాల్లో సాధారణం కంటే 3 డిగ్రీ సెల్సీయస్ అధిక ఉష్ణోగ్రత నమోదైంది. ఇక రాష్ట్రవ్యాప్తంగా 16 ప్రాంతాలు అధిక ఉష్ణోగ్రతలతో కుతకుతలాడాయి. ఈ ప్రాంతాల్లో గరిష్ట ఉష్ణోగ్రత 43 డిగ్రీ సెల్సీయస్ కంటే అధికంగా నమోదైంది. సోమవారం రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో ఆకాశం మేఘావృతం కావడంతో తక్కువ ఉష్ణోగ్రత నమోదైనప్పటికీ వాతావరణంలో తేమ శాతం పెరగడంతో ఉక్కపోత అధికంగా ఉంది.

తప్పనిసరైతేనే బయటకెళ్లాలి..

రానున్న రెండ్రోజులు భద్రాద్రి కొత్తగూడెం, హనుమకొండ, జయశంకర్ భూపాలపల్లి, జోగులాంబ గద్వాల, ఖమ్మం, మహబూబాబాద్, మహబూబ్‌నగర్, ములుగు, నాగర్‌కర్నూల్, నల్లగొండ, నారాయణపేట, సూర్యాపేట, వనపర్తి, వరంగల్ జిల్లాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు 41 డిగ్రీ సెల్సీయస్ నుంచి 44 డిగ్రీ సెల్సీయస్ మధ్యన నమోదు కావచ్చని వాతావరణ శాఖ అంచనా వేసింది. గురువారం నుంచి రాష్ట్రంలో గరిష్ట ఉష్ణోగ్రతలు కాస్త తగ్గే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. మంగళ, బుధ వారాల్లో ఆదిలాబాద్, కుమ్రుంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, కామారెడ్డి జిల్లాల్లోని కొన్నిచోట్ల వడగాడ్పుల తీవ్రత అధికంగా ఉంటుందని వాతావరణ శాఖ అంచనా వేసింది. ఈ మేరకు ఎల్లో అలర్ట్‌ను జారీ చేసింది. అత్యవసర పనులుంటే తప్ప మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల మధ్య బయటకు రావొద్దని అధికారులు హెచ్చరిస్తున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు వెళ్లేవారు తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కాగా రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో మంగళ, బుధ వారాల్లో ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 30 నుండి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులతో కూడిన తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ సూచించింది.

# హత్య చేసి.. ఆపై ఇన్‌స్టాలో..

(మొదటి పేజీ తరువాయి..)

తీర్చుకున్నామంటూ ఇన్‌స్ట్రాగామ్‌లో పోస్టు పెట్టి సంచలనం సృష్టించింది. కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాస్‌రావు కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఎస్ఆర్‌నగర్ పీఎస్ పరిధిలోని బోరబండలో నివాసముండే షేక్ షరీఫ్ గ్యాంగ్‌స్టర్. చిన్నచిన్న నేరాలకు పాల్పడుతుండేవాడు. ఓ కేసు విషయంలో షేక్ షరీఫ్ జైలుకు వెళ్లాడు. ఈ క్రమంలో ఆయన దగ్గర నంబర్%--%2గా ఉన్న తరుణ్‌రాయ్ గ్యాంగ్ మొత్తానికి తన ఆదీనంలోకి తీసుకున్నాడు. దీంతో షరీఫ్, తరుణ్‌రాయ్‌ల మధ్య విభేదాలు మొదలయ్యాయి. 2023లో దసర పండగరోజున రావణ దహనం సందర్భంగా షరీఫ్ గ్యాంగ్ తరుణ్‌రాయ్‌ను హత్య చేసింది. ఈ ఘటనలో ఏడుగురు పాలుపంచుకోగా, ప్రగతినగర్‌లో హత్యకు గురైన తేజస్ అలియాస్ తేజు అలియాస్ డీల్ ఏ3గా ఉన్నాడు. బెయిల్‌పై బయటకు వచ్చాక తేజస్ ప్రత్యర్థుల నుంచి ప్రమాదం పొంచి ఉందని ముందే గ్రహించి బాచుపల్లి పరిధిలోని ప్రగతినగర్‌లోబతుకమ్మకుంట వద్ద ఓ అపార్ట్‌మెంట్‌లో తల్లితో కలిసి ఉంటున్నాడు. తన గ్యాంగ్ స్నేహితులతో మాట్లాడటం, కలిసి పార్టీలు చేసుకోవడం జరిగేది. అయితే ఈ క్రమంలో తేజస్ తన స్నేహితులతో నెక్స్ట్ టార్గెట్ సమీర్ అని..అతడిని కూడా లేపేస్తామంటూ మాట్లాడినట్లు ప్రత్యర్థులకు తెలిసింది. ఈ క్రమంలో ఆదివారం తేజస్ తల్లి ఇంట్లో లేకపోవడంతో బోరబండ నుంచి స్నేహితులు మహేశ్, శివప్ప, మహేశ్‌లు ప్రగతినగర్‌కు వచ్చారు. తేజస్ ఇంట్లో నలుగురు కలిసి మద్యం సేవిస్తున్నారు. వచ్చిన ముగ్గురు స్నేహితుల్లో శివప్ప రెండు గ్యాంగ్‌లకు కామన్ ఫ్రెండ్. దీంతో ప్రత్యర్థులు శివప్పతో మాట్లాడి సమాచారం తెలుసుకున్నారు. మద్యం మత్తులో ఉన్న తేజస్‌ను హత్య చేయాలని పథకం వేసి, శివప్పతో లోకేషన్ షేర్ చేయించుకున్నారు. దాని ఆధారంగా ప్రగతిగనగర్‌లోని తేజస్ ఇంటి సమీపంలోకి చేరుకున్నారు.. తెల్లవారుజామున ఫుల్‌గా తాగిన తేజస్ ఇంటి నుంచి బయటకు వచ్చాడు. బైక్ ఎక్కే క్రమంలో ఒక్కసారిగా తేజస్‌పై కత్తులతో సమీర్, శివప్ప, సిద్దేశ్వర్, జయంత్‌లు విచక్షణరహితంగా పొడిచి హత్య చేశారు. అనంతరం కత్తులు చూపుతూ రీల్స్ చేసి ఇన్‌స్ట్రాగామ్‌లో పోస్ట్ చేశారు. ఈ రీల్స్‌కు రక్తచరిత్ర సినిమాలోని పాటను జత చేశారు. హత్యకు పాల్పడిన వారిని, తేజస్‌తో మద్యం సేవించిన వారిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్టు సమాచారం.

# మెట్రో ప్రయాణికులకు గుడ్‌న్యూస్

నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-ఏప్రిల్ 8:

ఉగాది సందర్భంగా ప్రయాణికులకు మెట్రో శుభవార్త అందించింది. సూపర్ సేవర్ హాలిడే కార్డ్, మెట్రో స్టూడెంట్ పాస్, సూపర్ ఆఫ్ పీక్ అవర్ ఆఫర్లు పొడిగించింది. ఉగాది పండగ నేపథ్యంలో మరో 6 నెలలపాటు ఆఫర్లు పొడిగిస్తున్నట్లు హైదరాబాద్ మెట్రో సోమవారం ప్రకటించింది. కాగా సూపర్ సేవర్ హాలిడే మెట్రో కార్డ్, మెట్రో స్టూడెంట్ పాస్, సూపర్ పీక్ అవర్ ఆఫర్‌లు మార్చి 31, 2024న ముగిసిన సంగతి తెలిసిందే. తాజాగా వాటిని మళ్లీ పొడిగిస్తున్నట్లు హైదరాబాద్ మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి వెల్లడించారు. కాగా సూపర్ సేవర్ మెట్రో హాలిడే కార్డు ద్వారా ఆదివారాలు, ప్రభుత్వ సెలవు దినాల్లో రోజుల్లో రూ.59కే ప్రయాణించవచ్చు. మెట్రోలో నగరంలో ఏ మూల నుంచి ఏ మూలకైనా అపరిమితంగా ప్రయాణం చేసే సౌలభ్యం ఉంది. ఇక సూపర్ ఆఫర్ పీక్ అవర్ ఆఫర్ అంటే ఉదయం 6 నుంచి 8 వరకు, రాత్రి 8 నుంచి చివరి మెట్రో వరకు ఈ ఆఫర్ ఉంది. ఈ ఆఫర్ కింది సాధారణ కార్డు ద్వారా టికెట్ తీసుకుంటే 10 శాతం రాయితీ ఇస్తున్నారు. . వీటితోపాటు మెట్రో స్టూడెంట్ పాస్‌లపై రాయితీ కూడా అందుబాటులో ఉంది.

# ఆన్‌లైన్ బెట్టింగ్‌కు కుటుంబ బలి

(మొదటి పేజీ తరువాయి..)

వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... చేవెళ్ల మండలం మల్కాపూర్ గ్రామానికి చెందిన ఆనంద్ (38) ఇందిర (36) దంపతులు. వీరికి శ్రేయాన్స్ (4) ఒక్కడే కొడుకు. పాల వ్యాపారం చేసే ఆనంద్ మూడేళ్ల క్రితం నుంచి బండ్లగూడజాగీర్ సన్‌సిటీ ఏరియాలోని యమున అపార్ట్‌మెంట్స్‌లో ఉంటున్నాడు. ఆనంద్ ఆన్‌లైన్‌లో గేమ్స్ ఆడుతూ బెట్టింగ్‌ల కారణంగా దాదాపు రూ.15 లక్షల వరకు అప్పులు చేసి, ఆర్థికంగా చితికిపోయాడు. దీంతో దంపతుల మధ్య నిత్యం గొడవలు జరిగేవి. 15 రోజుల క్రితం ఇరు కుటుంబాలకు చెందిన వారితోపాటు స్నేహితులు వచ్చి ఆన్‌లైన్‌లో గేమ్స్ ఆడొద్దని, బుద్ధిగా ఉండి కుటుంబాన్ని పోషించుకోవాలని చెప్పారు. అయినా ఆనంద్ ప్రవర్తనలో మార్పు రాలేదు. మూడురోజుల క్రితం మరోసారి ఆనంద్ ఆన్‌లైన్ బెట్టింగ్ ఆడినట్టు సమాచారం.

ఇదే విషయమై సోమవారం ఉదయం నుంచి ఇద్దరి మధ్య గొడవ జరిగింది. గొడవ జరిగిన సమయంలో ఇందిర తన కుటుంబసభ్యులకు ఫోన్ చేసి జరిగిందంతా చెప్పింది. ఆనంద్ కూడా తన స్నేహితులతోపాటు బంధువులకు ఫోన్ చేసి తాము ఆత్మహత్య చేసుకుంటున్నట్టు సమాచారం అందించాడు. దీంతో ఇరు కుటుంబాలకు చెందిన పెద్దలతోపాటు బంధుమిత్రులు ఫోన్లు చేసినా, ఇద్దరూ లిఫ్ట్ చేయలేదు. దీంతో వారంతా కంగారుపడి అపార్ట్‌మెంట్ వచ్చి చూడగా, మృతదేహాలు కనిపించాయి. వెంటనే రాజేంద్రనగర్ పోలీసులకు సమాచారం అందించారు. వారు సంఘటన స్థలాన్ని చేరుకొని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

# మే 25న తెలంగాణ మోడల్ స్కూల్స్ ఎంట్రన్స్ టెస్ట్ ఫలితాలు

నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-ఏప్రిల్8:

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మోడల్ స్కూళ్లలో 2024-25 విద్యా సంవత్సరానికి గానూ ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 7వ తేదీన ప్రశాంతంగా నిర్వహించారు. ఈ పరీక్షకు రాష్ట్ర వ్యాప్తంగా 81.80 శాతం మంది విద్యార్థులు హాజరైనట్లు విద్యాశాఖ వెల్లడించింది. ఈ ప్రవేశ పరీక్ష ఆధారంగా ఆరో తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకు ప్రవేశాలు కల్పించనున్నారు. ఈ ఏడాది ప్రవేశాల కోసం మొత్తం 62,982 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా వారిలో 51,525 మంది విద్యార్థులు ప్రవేశ పరీక్షకు హాజరయ్యారు. తెలంగాణ మోడల్ స్కూల్స్ ఎంట్రన్స్ టెస్ట్-2024 ఆబ్జెక్టివ్ విధానంలో జరిగింది. మొత్తం 100 ఆబ్జెక్టివ్ టైప్ ప్రశ్నలకు 100 మార్కులు కేటాయించారు. ఒక్కో ప్రశ్నకు ఒక్కొక్క మార్కు ఉంటుంది. 2 గంటల సమయంలో రాసిన ఈ పరీక్ష ఇంగ్లిష్/ తెలుగు మాధ్యమాల్లో జరిగింది. తెలంగాణ మోడల్ స్కూల్స్ ఎంట్రన్స్ టెస్ట్-2024 ఫలితాలు మే 25వ తేదీన విడుదల చేయనున్నారు. ఫలితాల ప్రకటన అనంతరం మే 27 నుంచి మే 31వ తేదీ వరకు ప్రవేశాలు కల్పిస్తారు. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 194 మోడల్ స్కూల్స్ ఉన్నాయి.

# పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఓడించాలి

- ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్
- మ్యానిఫెస్టోలోని అబద్ధపు హామీలు నమ్మి మోసపోవద్దు






**నాగర్ కర్నూల్ ప్రతినిధి జయశంకర్ (నేటి ఫోకస్‌న్యూస్)-ఏప్రిల్ 8:**

జిల్లా కేంద్రంలోని బిఆర్ఎస్ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించి, వారితో.. అసెంబ్లీ ఎన్నికల్లో ఆరు గ్యారెంటీల పేరుతో కాంగ్రెస్ దొంగ హామీలు ఇచ్చి,అధికారంలోకి వచ్చిందని, తర్వాత ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందని భారత రాష్ట్ర సమితి నాగర్ కర్నూలు పార్లమెంట్ అభ్యర్థి డా.ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ ఆరోపించారు.పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశంలో భాగంగా సోమవారం నాగర్ కర్నూల్ లో పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చే అబద్ధపు హామీలు, మ్యానిఫెస్టోలు నమ్మి ప్రజలెవరూ మోసపోవద్దనీ, ఆరు గ్యారెంటీలు అమలు చేయకుండా గారడీల పాలన సాగిస్తున్నారని విమర్శించారు. పార్లమెంటు ఎన్నికలు వంద రోజుల అబద్ధాల కాంగ్రెస్ ప్రభుత్వ పాలన, పదేళ్ల నిజమైన పాలన అందించిన భారాసల మధ్య జరుగుతున్నాయన్నారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో రాష్ట్రం సస్యశ్యామలం అయిందని గుర్తుచేశారు. కాంగ్రెస్ పాలనలో కరువు వచ్చి పంటలు ఎండిపోతున్న, రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా, ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు.

**ప్రాంతీయ పార్టీలను మట్టుపెట్టాలని కుట్ర: నిరంజన్ రెడ్డి**

కాంగ్రెస్, బీజేపిలు రెండు కలిసి ప్రాంతీయ పార్టీలను మట్టుపెట్టాలని చూస్తున్నాయని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ముందు చూపు లేకపోవడం వల్లే సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నయని ఆవేదన వ్యక్తం చేశారు.జాతీయ పార్టీలైన కాంగ్రెస్,భాజపా వల్లే ఉత్తర భారత దేశం అభివృద్ధిలో వెనుకబడిందని, ప్రాంతీయ పార్టీల మూలంగానే దక్షిణ భారత దేశం అభివృద్ధి చెందిందని పేర్కొన్నారు. నార్లాపూర్ రిజర్వాయర్ నుంచి గుడిపల్లి వరకు సాగునీరు అందించిన ఘనత కేసీఆర్ దేనని చెప్పారు.10 ఏళ్లు అభివృద్ధి చేసిన రాష్ట్రాన్ని 100 రోజుల్లోనే కాంగ్రెస్ పార్టీ భ్రష్టు పట్టించిందని ఆరోపిస్తూ, పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపికి ఎందుకు ఓటేయాలని ప్రశ్నించారు.

మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ.. రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ ఇచ్చిన ఘనత కేసీఆర్ దేనని, నాగర్ కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి అన్నారు. భారాస పాలనలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకుపోలేక పోవడం వల్లే పార్టీ ఓడిపోయింది అన్నారు. రైతులకు సాగనీరు, మిషన్ భగీరథ ద్వారా త్రాగునీరు అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. కందనూలు చెరువు ఎండిపోవడానికి కారణం కాంగ్రెస్ అవలంబిస్తున్న రైతు వ్యతిరేక విధానాలే కారణమని ఆరోపించారు. లోక్ సభ ఎన్నికల్లో భారాస గెలుపుకోసం అవసరమైతే పాదయాత్ర చేస్తానని పేర్కొన్నారు.

**ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే అక్రమ కేసులు:**

**మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు**

అసెంబ్లీ ఎన్నికల్లో సాధ్యం కానీ హామీలు ఇచ్చిన కాంగ్రెస్ వాటిని అమలు చేయమని ప్రశ్నిస్తే భారాస నేతలపై అక్రమ కేసులు పెడుతున్నారని, అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు ఆరోపించారు. కరువుతో అల్లాడుతున్న రైతులను కేసీఆర్ పరామర్శిస్తుంటే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఐపీఎల్ మ్యాచ్ లు చూస్తున్నారని విమర్శించారు. భారాస కార్యకర్తలు అక్రమ కేసులకు బయపడవద్దని, గడప గడపకు వెళ్ళి పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని కోరారు.ఈ ఎన్నికల సన్నాహక సమావేశంలో నాగర్ కర్నూల్ జిల్లా జడ్పీ చైర్మన్ శాంత కుమారి,మాజీ ఎమ్మెల్యేలు మర్రి జనార్ధన్ రెడ్డి,పార్టీ జిల్లా అధ్యక్షులు,మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, రాష్ట్ర నాయకులు అభిలాష్ రావు, బైకాని శ్రీనివాస్ యాదవ్,పలువురు జడ్పిటిసిలు, ఎంపిటిసిలు, మున్సిపల్ కౌన్సిలర్లు,సర్పంచులు పాల్గొన్నారు.

## భద్రాచలంలో ఈ నెల 9నుంచి 23వరకు

# శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలు

- 17న సీతారామచంద్ర స్వామి తిరుకల్యాణ మహోత్సవం
- 18న సీతారామచంద్ర స్వామి పట్టాభిషేక మహోత్సవం
- బ్రహోత్సవాల సందర్భంగా విస్తృత ఏర్పాట్లు
- కళ్యానోత్సవం, పట్టాభిషేకానికి టిక్కట్ల విక్రయం



**భద్రచలం, (నేటి ఫోకస్‌న్యూస్)-ఏప్రిల్ 08:**

సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో శ్రీరామ నవమి బ్రహ్మోత్సవాలు ఈ నెల 9వ తేదీ నుంచి 23నుంచి వైభంగా నిర్వహించేందుకు దేవస్థానం ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. బ్రహోత్స వాలలో భాగంగా ఈ నెల 17వ తేదీన సీతారామ చంద్ర స్వామి తిరుకళ్యాణ మహోత్సవం, 18న స్వామివారి పట్టాభిషేకం వైభంగా నిర్వహించను న్నట్లు దేవాదాయం ధర్మాదాయ శాఖ కమిషనర్ తెలిపారు. ఈ ఉత్సవాలను వీ-క్షించాలనుకునే భక్తుల కోసం ప్రత్యేకంగా టికెట్లు విక్రయిస్తున్నారు. కళ్యాణోత్సవానికి రూ.7500 (ఉభయ దాతలు) రూ.2500, రూ.2000, రూ.1000, రూ.300, రూ.150 పట్టాభిషేకానికి రూ.1500, రూ.500, రూ.100 సెక్టారు టిక్కెట్లను దేవస్థాన వెబ్ సైట్ https://bhadradritemple.telengana.gov.inనందు బుకింగ్ చేసుకోవచ్చని సూచించారు. రూ.10000, రూ.5000 సెక్టార్ టిక్కెట్లు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో విక్రయించనున్నట్లు తెలిపారు.

**బ్రహోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు..**

శ్రీరామ నవమి బ్రహోత్సవాల సందర్భంగా భద్రచలంలో భక్తుల కోసం విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.ఎండాకాలం కావడంతో ఆలయం చుట్టూ 4లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో వెదురు తడికెలు, క్లాత్ పెండాల్స్ తో చలువ పందిర్లు వేశారు. గోదావరి ఘాట్, విస్తా కాంప్లెక్సు వద్ద భక్తుల వసతి నిమిత్తం ఉచిత షెల్టర్లు ఏర్పాటు చేయనున్నారు. కళ్యాణ మంటపంలో భక్తులంతా కళ్యాణోత్సవం, పట్టాభిషేకం చూసేందుకు అనువుగా అన్ని సెక్టార్లలో ఎల్ఇడీ స్క్రీన్స్, కూలర్లు, ఫ్యాన్లు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. ఎండాకాలం కావడంతో దాహార్తి తీర్చేందుకు ఉచితంగా మంచినీరు, మజ్జిగ ప్యాకెట్లు అందజేస్తారు. నిత్యాన్నదాన సత్రంలో అన్నప్రసాదం అందిస్తారు. భక్తులందరికీ స్వామి తలంబ్రాలు అందజేసేందుకు భద్రాచలం పట్టణంలో ప్రత్యేకంగా 60 కౌంటర్లు ఏర్పాటు చేసి సుమారు 250 క్వింటాళ్ళ తలంబ్రాలు ఉచితంగా అందజేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారవర్గాలు తెలిపాయి. స్వామి లడ్డూ పరసాదం విక్రయించేందుకు 19 కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు, 2,50000 లడ్డూలు సిద్ధం చేసినట్లు వివరించారు. ఉత్సవాలకు ఎలాంటి లోటుపాట్లు రాకుండా చర్యలు చేపడుతున్నారు.

## ఉగాది పండుగను సుఖ సంతోషాలతో

# జరుపుకోవాలి

- కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

**వనపర్తి ప్రతినిధి, (నేటి ఫోకస్‌న్యూస్):**



జిల్లా ప్రజలకు కలెక్టర్ తేజస్ నంద లాల్ పవార్ ఉగాది, రంజాన్ పండుగల శుభాకాంక్షలు తెలిపారు.

శ్రీ క్రోధి నామ తెలుగు సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో కొత్త సంవత్సరంలో ప్రజల కు శుభం కలగాలని, ప్రజల ఆశలు ఆకాంక్షలన్నీ నెరవేరాలని ఆకాంక్షించారు. నూతన సంవత్సరంలో వనపర్తి జిల్లా అన్ని రంగాల్లో మెరుగైన అభివృద్ధి సాధించి, ఆదర్శంగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మన సంస్కృతి సంప్రదాయాలు చాటిచెప్పేలా ఉగాది పండుగను సంతోషంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు.అదేవిధంగా, ముస్లిం సోదరు లకు జిల్లా కలెక్టర్ రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. మనిషి లోని చెడు భావాల్ని, అధర్మాన్ని, ద్వేషాన్ని రూపుమాపుతూ మానవాళికి హితాన్ని బోధించే గొప్ప పండుగ రంజాన్ అని పేర్కొన్నారు. ముస్లిం సోదరులు రంజాన్ పండగను ఆనందంతో.. సుఖసంతోషాలతో నిర్వహించుకోవాలని కలెక్టర్ ఆకాంక్షించారు.

## మోకాళ్ళ నొప్పులకి మహాదేవ్

# ఆసుపత్రిలో వైద్యం సదుపాయం

- అచ్చంపేట పట్టణంలో మొట్టమొదటి సారిగా మోకాల మార్పిడి ఆపరేషన్
- విజయవంతంగా పూర్తి చేసిన ఆసుపత్రి వైద్య బృందం
- మోకాళ్ళ నొప్పుల కోసం ఇతర జిల్లాలకు వెళ్తున్న వైన్యం..
- ఇకముందు మన ప్రాంతంలోని మోకాళ్ళ సమస్యకు పరిష్కారం
- అందుబాటులో ఉంటున్న వైద్యులు

**ఉమ్మడి మహబూబ్నగర్ ప్రతినిధి, (నేటి పోకస్‌న్యూస్)-చారకొండ వెంకటేష్ ఏప్రిల్ 8**



అచ్చంపేట పట్టణంలోని మహదేవ్ హాస్పిటల్ లో మొట్ట మొదటి సారిగా మోకాల మార్పిడి ఆపరేషన్‌ను విజయవంతంగా చేయడం జరిగిందని మహదేవ్ ఆసుపత్రి వైద్యుడు డాక్టర్ మహేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అచ్చంపేట మండలంలోని పల్కపల్లి గ్రామానికి చెందిన దుర్గయ్య (55) వ్యక్తి తీవ్రమైన మోకాళ్ళ నొప్పులతో గత నాలుగు సంవత్సరాలుగా మోకాళ్లు అరిగిపోయి నడవలేక ఇబ్బంది పడుతున్నాడు. అచ్చంపేటలో మోకాళ్ళ సమస్యకు సరైన వైద్యం అందించే వసతి లేకపోవడం కార్పొరేట్ ఆసుపత్రిలో వైద్యం చేయించుకునే స్తోమత లేనందువలన అలాగే ఇబ్బంది పడుతూ కాలం వెళ్లదీస్తూ వచ్చాడు. ఈ నెల 7న. మోకాళ్ళ నొప్పి అధికమవడంతో అచ్చంపేట పట్టణంలోని మహదేవ్ ఆసుపత్రిలో అడ్మిట్ కావడం జరిగింది. పూర్తిస్థాయిలో మోకాళ్ళ నొప్పులతో బాధపడుతున్న ఆ వ్యక్తిని పరీక్షించిన వైద్యుడు డాక్టర్ రాజు మోకాళ్ళ నొప్పికి సంబంధించిన అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆపరేషన్ చేస్తే మోకాళ్ళ సమస్యకు శాశ్వత పరిష్కారం దొరుకుతుందని చెప్పడం జరిగింది. ఈ నెల 7 వ. తేదీన మహదేవ్ ఆసుపత్రిలో డాక్టర్ మహేష్, కార్తిక్, రాజు ల ఆధ్వర్యంలోని వైద్య బృందం ఆర్తోపెటిక్ మోకాళ్ళ మార్పిడి ఆపరేషన్ ను విజయవంతంగా పూర్తి చేశారు. నల్లమలలో ఆధునిక వైద్యం మెరుగుపడటం వలన నిరుపేద కుటుంబాలకు ఎంతో లబ్ది చేకూరుతుందని ప్రజలు ఆశాభావం వ్యక్తంచేశారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు మహదేవ్ ఆసుపత్రి నిరంతరం అందుబాటులో ఉంటుందని ఇక్కడ అన్నిరకాల వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని వైద్యుడు తెలిపారు.

# బీజేపీ తరఫున కంటోన్మెంట్ బరిలో నిలిచి గెలుస్తా..

- వర్రి తులసిరాం విజయ్ కుమార్

**ఫోకస్ న్యూస్, కంటోన్మెంట్:** కంటోన్మెంట్ అసెంబ్లీ ఉప ఎన్నిక బరిలో బిజెపి పార్టీ నుండి బరిలో ఉంటున్నట్లు, బిజెపి పార్టీ సీనియర్ నాయకుడు వర్రి తులసిరామ్ విజయ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగ తన కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ.... కంటోన్మెంట్ నియోజకవర్గంలో వివిధ పార్టీల అభ్యర్థులు ఒకరు ఊసరవెల్లి అయితే, మరొకరు ప్రజలకు కనీసం విలువ గౌరవం ఇవ్వనివారు అభ్యర్థులుగా ఉన్నారని, తనకు ఈ ఉప ఎన్నికలలో అన్ని వర్గాల ప్రజల ఆశీస్సులు ఉన్నాయని, తనకు ఒక అవకాశం ఇస్తే నియోజకవర్గన్ని అభివృద్ధి చేసి చూపిస్తానని ఆయన ప్రజలను కోరారు. తన తండ్రి మూడుసార్లు పార్లమెంటు మెంబర్ గా కొనసాగారని తెలిపారు. తను ఎమ్మెల్యే గా గెలిస్తే నరేంద్ర మోడీ సహకారంతో నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి చూపిస్తానని తెలిపారు.



# పేదలకు రంజాన్ తోఫా అందజేసిన మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి

**వనపర్తి ప్రతినిధి, (నేటి ఫోకస్‌న్యూస్):**

రంజాన్ పండగను పురస్కరించుకొని మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి ముస్లిం పేదలకు రంజాన్ తోఫా అందజేశారు. ఈ మేరకు సోమవారం నాడు పార్టీ శ్రేణులతో కలిసి 100 మందికి రంజాన్ తోఫా అందజేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పేద ముస్లింలకు దుస్తులు పండగ సరుకులు పంపిణీ చేసే వారిని గుర్తు చేశారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ బి. కుమార్ యాదవ్, మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్ మైనారిటీ నాయకులు జోహార్ హుస్సేన్ తదితరులు ఉన్నారు.



# కొత్త సంవత్సరంలో ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలి

- మాజీ ఎమ్మెల్యే రావుల చంద్రశేఖర రెడ్డి

**వనపర్తి ప్రతినిధి, (నేటి ఫోకస్‌న్యూస్) :**

కొత్త సంవత్సరంలో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని మాజీ ఎమ్మెల్యే ఆవుల చంద్రశేఖర రెడ్డి ఆకాంక్షించారు. ఉగాదిని పురస్కరించుకొని శ్రీ క్రోధి నామ సంవత్సర పంచాంగాన్ని ఆయన సోమవారం ఆవిష్కరించారు. జిల్లా కేంద్రానికి చెందిన ఓరుగంటి మనోహర్ శర్మ రచించిన పంచాంగాన్ని ఆవిష్కరించి మనోహర్ శర్మ కుమారుడు నాగరాజు శర్మను ఘనంగా సన్మానించారు. అనంతరం వనపర్తి జిల్లా ప్రజలకు క్రోధి నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్ బాలు నాయుడు అమరేందర్ పాల్గొన్నారు.



# అన్నదాతలకు కాడెద్దుల వితరణ

**వనపర్తి ప్రతినిధి, (నేటి ఫోకస్‌న్యూస్) :**

వనపర్తి నియోజకవర్గంలోని పెద్దమందడి మండలానికి చెందిన ఐదు మంది అన్నదాతలకు మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి కాడెద్దులు వితరణ చేశారు. తన వ్యవసాయ క్షేత్రంలో పెంచిన ఐదు జతల కోడెలను గడెం కొట్టేందుకు పేద రైతులను గుర్తించి సోమవారం వారికి అప్పగించారు. అల్వాల కు చెందిన చిన్న బాల్ రెడ్డి గొల్ల మొగిలయ్య గోవర్ధన్ రెడ్డి హరిజన బాలయ్య పురుషోత్తం రెడ్డిలకు ఒక్కొక్కరికి ఒక జత చొప్పున 5 మందికి 10 కాడెద్దులను అందజేసి ఔదార్యం చాటుకున్నారు. దీంతో రైతులు మాజీ మంత్రి నిరంజన్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# విద్యార్థినిలు క్షేత్రస్థాయిలో పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

- కళాశాల డైరెక్టర్ షహలాబుతుల్

**మిర్యాలగూడ, (నేటి ఫోకస్‌న్యూస్)-ఏప్రిల్ 08:**

మిర్యాలగూడ పట్టణం లోని మీనా మహిళా ఇంజనీరింగ్ కళాశాల ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్ ఇంజనీరింగ్ విద్యార్థినిలు జె.యన్.టి.యు.హెచ్ పాఠ్యప్రణాళికలో భాగంగా ఈ రోజు కొత్తగూడెం థర్మల్ విద్యుత్ (కే.టీ.పీ.ఎస్) ఉత్పాదక కేంద్రాన్ని సందర్శించడం జరిగింది. 1800 మెగా వాట్ల విద్యుత్ ఉత్పాదన నాలుగు యూనిట్ల ద్వారా బొగ్గు ఇంధనం గా ఉపయోగించి ఏ విధంగా ఉత్పత్తి చేయటం జరుగుతుందో అక్కడ ఉన్న నిపుణుల ద్వారా అడిగి తెలుసుకోవడం జరిగింది. టి.యస్ జెన్కో సారథ్యంలో పనిచేస్తున్న ఈ ఉత్పాదక కేంద్రం యొక్క నిర్మాణం మరియు వివిధ యంత్రాల పనితీరు విద్యుత్ ఉత్పత్తి స్టోరేజ్ డివైసెస్, ఆర్మీచర్, పులింగ్ వంటి అంశాల పట్ల విద్యార్థులకు తగిన జ్ఞానాన్ని హిత బోధ చేశారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ షహలాబుతుల్ మాట్లాడుతూ ఇలాంటి సాంకేతిక పర్యటనల వలన విద్యార్థినిలు క్షేత్రస్థాయిలో పరిజ్ఞానాన్ని పెంపొందించుకొని ఉన్నత విద్యా విధానాలకు దోహదపడే విధంగా తమను తీర్చిదిద్దుకోవచ్చన్నారు. బ్రాంచ్ విభాగాధిపతి పూజ, టాస్క్ కో-ఆర్డినేటర్ ఫయాజ్, సురేష్, వెంకటరమణ, భాస్కర్, శాంతి తదితరులు పాల్గొన్నారు.

# క్రమశిక్షణ, ధార్మికత, దాతృత్వానికి ప్రతీక రంజాన్

- మాజీ ఎంపీ.రావుల చంద్రశేఖర్ రెడ్డి

**వనపర్తి ప్రతినిధి నేటి ఫోకస్ న్యూస్:**

పవిత్ర రంజాన్ పండుగ సందర్భంగా ముస్లిం సోదరులకు మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర రెడ్డి సోమవారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. పట్టణంలోని 13మజీద్ లను స్వయంగా సందర్శించి ఇఫ్తార్ ఇచ్చారు.ఈ సందర్భంగా మౌజాంలను,ఇమామ్ సాబ్ లను సన్మానించారు.అనంతరం జామా మజీద్ నందు ముస్లిం సోదరులతో కలిసి ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గట్టు యాదవ్,జిల్లా అధికార ప్రతినిధి వాకిటి.శ్రీధర్,పట్టణ అధ్యక్షులు రమేష్ గౌడ్, మీడియా కన్వీనర్ నందిమల్ల.అశోక్ కౌన్సిలర్స్ సమద్, నాగన్న యాదవ్, బండారు.కృష్ణ నాయకులు గులాం ఖాదర్ ఖాన్,ఫజల్, ఎండిగౌస్, నందిమల్ల.రమేశ్,వహీద్ జహంగీర్, జోహెబ్ హుస్సేన్, స్టార్ రహీమ్, ఖాదర్, ప్రేమ్‌నాథ్ రెడ్డి, తిరుమల్, హరీఫ్ పాల్గొన్నారు.

# బన్నీకి వెల్లువెత్తిన బర్త్‌డే విషెస్..

## పుష్ప2 నుంచి అల్లు అర్జున్ గెటప్ విడుదల




**నేడు ఐకాన్ స్టార్ అల్లు అర్జున్** పుట్టినరోజు అన్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఆయనకు సోషల్ మీడియా వేదికగా అభిమానులు, సినీ ప్రముఖులు బర్త్ డే విషెస్ తెలిపారు. ఇప్పటికే టాలీవుడ్ అగ్ర నటుడు మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ కూడా పుట్టినరోజు శుభాకాంక్షలు బావ అంటూ బన్నికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపాడు. తాజాగా జనసేన అధినేత పవన్ కళ్యాణ్ అల్లు అర్జున్‌కు ఎక్స్ వేదికగా పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపాడు.హ్యాపీ బర్త్ డే బన్నీ.. జాతీయ అవార్డు గ్రహీత, చక్కటి అభినయ కౌశలం కలిగిన కథానాయకుడు అల్లు అర్జున్ కి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు. భవిష్యత్తులో బన్నీ మరిన్ని పురస్కారాలు, విజయాలు అందుకోవాలని ఆకాంక్షిస్తున్నాను అంటూ పవన్ కళ్యాణ్ తెలిపాడు. నేడు ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ పుట్టినరోజు. ఈ సందర్భంగా సినీ ప్రముఖులతో పాటు పలువురు సెలబ్రిటీలు బన్నికి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్నారు. అయితే అల్లు అర్జున్ నటిస్తున్న పాన్ ఇండియా మోస్ట్ అవైటెడ్ ప్రాజెక్ట్ పుష్ప.. ది రూల్. ఈ సినిమాకు లెక్కల మాస్టార్ సుకుమార్ దర్శకత్వం వహిస్తుండగా.. కన్నడ భామ రష్మిక మందన్నా మరోసారి ఫీ మేల్ లీడ్ రోల్ పోషిస్తోంది. ఈ సినిమా నుంచి నేడు బన్ని బర్త్ డే కానుకగా టీజర్ విడుదల చేయనున్నట్లు మేకర్స్ అనౌన్స్ చేసిన విషయం తెలిసిందే. తాజాగా ఈ సినిమా నుంచి మేకర్స్ టీజర్ విడుదల చేశారు. గంగమ్మ తల్లి జాతరలో అమ్మవారి గెటప్ లో అల్లు అర్జున్ ఫైట్ సీన్‌తో ఫుల్ యాక్షన్ ప్యాక్ట్‌డ్‌గా సాగింది ఈ టీజర్. సోమవారం అల్లు అర్జున్ పుట్టినరోజు పురస్కరించుకుని చిత్రబృందం స్పెషల్ సర్‌ప్రైజ్ ఇచ్చింది. 'పుష్ప ది రూల్' టీజర్ విడుదల చేసింది. సినిమాలో కీలకంగా సాగే జాతర సన్నివేశాలతో ఇది సిద్ధమైంది. మాస్ అవతార్‌లో బన్నీ లుక్స్, యాక్షన్ సన్నివేశాలు ఈలలు వేయించేలా ఉన్నాయి. ఎర్రచందనం స్మగ్లింగ్ నేపథ్యంలో సాగే కథతో తెరకెక్కిన చిత్రం 'పుష్ప ది రైజ్'. 2021లో విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లు రాబట్టింది. ఎర్రచందనం కూలీ నుంచి స్మగ్లింగ్ సిండికేట్‌కు నాయకుడిగా పుష్ప ఎలా ఎదిగాడని మొదటి భాగంలో చూపించారు. మరి, సిండికేట్‌కు లీడర్ అయ్యాక పుష్పకు ఎదురైన సవాళ్లు ఏమిటి? మంగళం శ్రీను, భన్వర్ సింగ్ షెకావత్, దాక్షాయణి నుంచి ఎలాంటి ప్రమాదం పొంచి ఉందనే అంశాలతో 'పుష్ప ది రూల్' సిద్ధం కానున్నట్లు తెలుస్తోంది. మైత్రి మూవీ మేకర్స్ పతాకంపై ఇది నిర్మితమవుతోంది. దేవిశ్రీ ప్రసాద్ స్వరాలు అందిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ తెరకెక్కిస్తున్న సీక్వెల్ ప్రాజెక్టులో కన్నడ భామ రష్మిక మందన్నామరోసారి ఫీ మేల్ లీడ్ రోల్ పోషిస్తోంది.

## అల్లుకు మెగా బ్రదర్స్ శుభాకాంక్షలు

నేడు ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ పుట్టినరోజు అన్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఆయనకు సోషల్ మీడియా వేదికగా అభిమానులు, సినీ ప్రముఖులు బర్త్ డే విషెస్ తెలుపుతున్నారు. ఇప్పటికే టాలీవుడ్ అగ్ర నటుడు మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ కూడా పుట్టినరోజు శుభాకాంక్షలు బావ అంటూ బన్నికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపాడు. తాజాగా జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఎక్స్ వేదికగా శుభాకాంక్షలు తెలిపాడు. హ్యాపీ బర్త్ డే బన్నీ.. జాతీయ అవార్డుగ్రహీత, చక్కటి అభినయ కౌశలం కలిగిన కథానాయకుడు అల్లు అర్జున్‌కి హృదయ పూర్వక జన్మదిన శుభాకాంక్షలు. భవిష్యత్తులో బన్నీ మరిన్ని పురస్కారాలు, విజయాలు అందుకోవాలని ఆకాంక్షిస్తున్నాను అంటూ తెలిపాడు. మరోవైపు చిరంజీవి కూడా అల్లు అర్జున్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ.. పుట్టినరోజు శుభాకాంక్షలు డియర్ బన్నీ. ఈ సంవత్సరం మీకు సంతోషం, సక్సెస్‌లతో నిండలాని కోరుకుంటున్నాను. పుష్ప టీజర్ సూపర్‌గా ఉంది అంటూ రాసుకోచ్చాడు.

## యానిమల్ కోసం చాలా కష్టపడ్డా: రష్మిక



'యానిమల్'లో గీతాంజలి పాత్రలో తనదైన నటనతో అభిమానుల్ని మెప్పించింది రష్మిక. విమర్శలతో పాటు ప్రశంసలు అందుకున్న ఈ చిత్రంలో కర్వాచౌత్ పండగ సందర్భంలో వచ్చే సన్నివేశంలో డైలాగులు సరిగ్గా చెప్పలేదంటూ ఆమె విమర్శలు ఎదుర్కొన్న సంగతి తెలిసిందే. తాజాగా జరిగిన ఓ ఇంటర్వ్యూలో ఆమెపై వస్తోన్న ట్రోల్స్ గురించి స్పందిస్తూ... 'యానిమల్'లో కొన్ని సన్నివేశాల్లో నా ముఖం, నటన, డైలాగ్ చెప్పే విధానం బాగాలేదని విమర్శిస్తున్నారు. అందులో కర్వాచౌత్ సన్నివేశం గురించి ఎక్కువ ట్రోల్స్ చేస్తున్నారు. కానీ.. ఆ సన్నివేశం ఈ సినిమాకే ప్రత్యేకం. ఒక్క సీన్‌లోనే ఎన్నో రకాల హావభావాల్ని పలికించాల్సి వచ్చింది. దానికోసం నేనెంత కష్టపడ్డానో నాకు మాత్రమే తెలుసు. అందులో నా నటన చూసి సెట్లో, థియేటర్లలో మంచి ప్రశంసలు వచ్చాయి. విచిత్రమేంటంటే.. 9 నిమిషాల సీన్‌లో 10 సెకన్ల డైలాగ్ బాగా లేదని నన్ను ట్రోల్స్ చేశారు. ఇలాంటి వాటిని నేను పట్టించుకోను. ఎలాంటి సన్నివేశాలకి ఏ విధంగా నటించాలో నాకు తెలుసు. అయినా ఎవరి అభిరుచి వాళ్లది. అందరికీ అన్నీ నచ్చాలని లేదు కదా' అంటూ చెప్పుకొచ్చింది రష్మిక. ప్రస్తుతం 'పుష్ప 2', 'ది గర్ల్‌ఫ్రెండ్' చిత్రీకరణలో ఉందామె.

## జగపతిబాబు సీరియస్ లుక్



**రవితేజ కథానాయకుడిగా** హరీశ్ శంకర్ తెరకెక్కిస్తున్న చిత్రం 'మిస్టర్ బచ్చన్'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. జగపతిబాబు కీలక పాత్ర పోషిస్తున్నారు. ఆయన పాత్రకు సంబంధించిన ఫస్ట్‌లుక్‌ను చిత్ర బృందం విడుదల చేసింది. ఇందులో జగపతిబాబు సీరియస్ లుక్‌లో ఆసక్తికరంగా కనిపించారు. ఈ చిత్రంలో ఆయన పాత్ర చాలా శక్తిమంతంగా ఉండనుందని చిత్రవర్గాలు తెలిపాయి. మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోన్న ఈ సినిమా ఇప్పటికే ఎనభై శాతం చిత్రీకరణ పూర్తి చేసుకుంది. మిగిలిన పనుల్ని త్వరలోనే పూర్తి చేసి విడుదల తేదీ ప్రకటించనున్నారు. సంగీతం: మిక్కీ జె. మేయర్, ఛాయాగ్రహణం: అయనంక బోస్.

# కన్నప్ప ప్రభాస్ కీ రోల్..



**టాలీవుడ్ నటుడు** మంచు విష్ణు హీరోగా వస్తున్న తాజా చిత్రం 'కన్నప్ప' . మోహన్ బాబు నిర్మాణంలో వస్తున్న ఈ చిత్రానికి మహాభారతం సీరియల్ ఫేమ్ ముఖేష్‌కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నాడు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుపుకుంటున్న విషయం తెలిసిందే. అత్యంత భారీ బ్జడెట్‌తో పాన్ ఇండియా స్థాయిలో ఈ చిత్రం రూపొందుతోంది. రీసెంట్‌గా మహాశివరాత్రి కానుకగా ఈ సినిమా నుంచి ఫస్ట్ లుక్ కూడా వదిలారు మేకర్స్. ఈ ఫస్ట్ లుక్‌లో విష్ణు జలపాతం నుంచి ఎంట్రీ ఇస్తూ.. బాణంను ఎక్కుపెట్టినట్లు కనిపిస్తున్నాడు. ప్రస్తుతం ఈ పోస్టర్ వైరల్ అవుతుండగా.. తాజాగా మూవీకి సంబంధించి ఒక సాలిడ్ అప్‌డేట్ బయటకు వచ్చింది. ఈ సినిమాలో ఇప్పటికే మోహన్‌లాల్, మోహన్‌బాబు, ప్రభాస్ వంటి అగ్ర తారలు భాగమవుతున్న విషయం తెలిసిందే. తాజాగా మరో అగ్రహీరో ఈ సినిమాలో నటించబోతున్నాడు. బాలీవుడ్ స్టార్ నటుడు అక్షయ్ కుమార్ ఈ సినిమాలో కీలక పాత్రలో నటించ నున్నట్లు తెలుస్తుంది. కాగా దీనిపై మేకర్స్ నుంచి ప్రకటన రావాల్సి ఉంది. ఇటీవల న్యూజిలాండ్ లో లాంగ్ షెడ్యూల్ పూర్తి చేసుకున్న చిత్ర బృందం ఇండియాకు తిరిగొచ్చింది. తాజా సమాచారం ప్రకారం ఏప్రిల్‌లో మొదలయ్యే తాజా షెడ్యూల్‌లో ప్రభాస్ జాయిన్ కాబోతున్నట్లు తెలిసింది.

